లింగ్ బెల్ మ్రోగింది.

విమలా ఆచార్య తలుపు తెరిచి చూసింది. పార్వతీశం హుందాగా చిరునవ్వుతో చేతులు జోడించాడు. ఆయన రిటైర్డ్ ఎయిర్ కమెడోర్.

విమల కూడా జవాబుగా చేతులు జోడించి, ఆప్యాయంగా ఆహ్వానిస్తూ "రండి. ఆయన మీకోసమే ఎదురుచూస్తున్నారు" అంది.




కాటూరు రవీంద్రత్రివిక్రమ్

పార్వతీశం లోపలికి వస్తూండగానే "వెల్ కమ్ కమెడోర్" అంటూ గంభీరస్వరంతో ఆహ్వానించాడు రిటైర్డ్‌వింగ్ కమేండర్ జగన్నాథ ఆచార్య.

"గుడీవినింగ్ సర్"

"గుడీవినింగ్... రా... కూర్చో..." అంటూ సోఫా చూపించాడు.

"పార్వతీశం! నేను నీకన్నా వయస్సులో పెద్దవాడ్ని. నువ్వు నాకన్నా హోదాలో రెండు ర్యాంకులు పెద్దవాడివి... నిన్ను సర్ అనలేను... పేరుపెట్టి పిలుస్తూంటే నువ్వేమైనా అనుకుంటావేమోనని అనుమానం..." అంటూ నవ్వేడు జగన్నాథాచార్య.

"అలాంటి అనుమానాలేం పెట్టుకోకండి. రిటైరయ్యాక అందరూ సమానమే. ఇక్కడ మీ పెద్దరికమే ప్రధానం. మీరు సర్వీసులో చేరినప్పుడు నేనింకా విద్యార్థిగానే ఉండేవాడిని. ఆ సంగతి నేను ఎప్పుడూ మర్చిపోను..."

సిపాయిలు దేశమాతకి ముద్దు పాపాయిలు. ప్రాణాలను పణంగా పెట్టి, మన సరిహద్దుల్ని సదా రక్షిస్తూంటారు. వారి వీరగాథలు యువతకి ఆదర్శం, స్ఫూర్తిదాయకం కావాలి.


ఈ కథలు వాస్తవ సంఘటనల నేపథ్యంతో రచించబడ్డాయి. రచయిత శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ 1964 నుంచి 1980 వరకు వైమానిక దళంలో పనిచేసిన కాలంలో స్వయంగా రెండు యుద్ధాలలో పాల్గొన్నారు. మిలట్రీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అనేక మంది యుద్ధవీరుల విజయగాథల గురించి వివరాలు సేకరించారు. యుద్ధరంగం వేదికగా, దేశభక్తి ఊపిరిగా, త్రివిధ దళాల యుద్ధవీరులు సజీవ పాత్రలుగా వెలువడుతున్న ఈ కథలు 'కథాకేళి' పాఠకులకు ప్రత్యేకం.

"అద్సరే... ఏమిటివాళ మన ప్రోగ్రామ్? చదరంగమా, కబుర్లా?"

"కబుర్లే చెప్పుకుందాం. కార్గిల్ యుద్ధం తీవ్రంగా ఉంది. మీ అబ్బాయిలిద్దరూ ఫ్రాంటియర్స్‌లోనే ఉన్నారా?"



పద్మపాణి భార్య చారులతని పరామర్శిస్తున్న గవర్నర్




"ఇద్దరూ 2-రాజ్‌పుతానా రైఫిల్స్‌లోనే ఉన్నారు. పెద్దవాడు పద్మపాణి మేజర్ ర్యాంకులో ఉన్నాడు. రెండోవాడు కెప్టెన్..."

"పేర్లు కూడా మంచివి పెట్టారు. పద్మపాణి, పద్మసంభవ్! అమ్మాయి పేరు సంఘమిత్ర కదూ?" కుతూహలంగా అడిగాడు పార్వతీశం.

"అవును! ఆడపిల్ల కాబట్టి పెళ్లి చేసి పంపాను. లేకపోతే డిఫెన్సులో చేర్చేవాడిని. అప్పటికీ తను కూడా ఆర్మీలో చేరతానని గొడవ. డాక్టరు అయితేనే ఆ అవకాశం ఉంది... ఇప్పుడు రోజులూ, పద్ధతులూ మారిపోయాయి. మహిళలు ఎయిర్‌ఫోర్స్ పైలట్లు అవుతున్నారు. ఆర్మీలో కూడా చేరే అవకాశాలు రావచ్చు. తన ఏడేళ్ల కూతురు పెద్దయ్యాక సైన్యంలో చేర్పిస్తానంటూంటుంది మా సంఘమిత్ర" ఆయన నవ్వాడు.

"అన్నట్టు మీ చిన్నమ్మాయి ఆమ్రపాలి ఏం చేస్తోంది?"

"తను కూడా సైన్యంలో చేరేందుకు గట్టిగా ప్రయత్నించింది. కానీ బ్యాడ్‌లక్... సెలెక్టు కాలేదు. ఇప్పుడు పై చదువులు చదువుతోంది"

"పిల్లలందరికీ మీ స్ఫూర్తి ఉందనుకుంటాను..." అభినందనగా అన్నాడు.


"సహజంగా ఉంటుంది"

"మీ పద్మపాణి పుట్టినపుడు మీరు ఎయిర్‌ఫోర్స్‌లోనే ఉన్నారనుకుంటాను"

"అవును! ఒరిస్సా పోస్టింగ్‌లో ఉన్నప్పుడు 'చార్బాటియా'లో పుట్టాడు. అక్కడే మూడో తరగతి వరకూ చదువుకున్నాడు. నాకింకా వాడి బాల్యం గుర్తు. నా యూనిఫారం వేసుకుని ఇల్లంతా తిరిగేవాడు. చొక్కాలో మునిగిపోయేవాడు. వాడి వేషం చూసి తెగ నవ్వుకునేవాళ్లం. వాడికి ఆ వయసులోనే సైన్యం మీద మోజు ఉండేదని తర్వాత తర్వాత అర్థమయింది".

"తర్వాత ఎక్కడ చదువుకున్నాడు?"

"కటక్, గౌహతిల్లో ఇంటర్మీడియెట్ వరకూ చదివి, తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్‌లో



మేజర్ పద్మపాణి ఆచార్య

మూడేళ్ల కోర్సు చేసాడు. ఆ తరువాత ఉస్మా నియా యూనివర్శిటీలో బియ్యే డిగ్రీ చేసి, తన 23వ ఏట ఆర్మీలో చేరాడు. అన్నిట్లో మెరిట్ సంపాదించాడు. మేజర్‌గా ప్రమోట్ అయ్యాడు. రెండోవాడు పద్మసంభవ్ కూడా అన్నగారి బాట లోనే నడుస్తున్నాడు. నేను మూడు యుద్ధాల్లో పాల్గొన్నాను. ఇప్పుడు నా కుమారులిద్దరూ యుద్ధరంగంలో సేవలందిస్తున్నారు. ఈ దేశా నికి సేవ చేయడానికి మించిన ఘనమైన పూజ మరొకటి లేదు. మా అందరికీ భరతమాతే తల్లీ, తండ్రీ, దైవం - సమస్తం..." ఉద్వేగంతో అన్నా డు జగన్నాధ ఆచార్య.

పార్వతీశం మనసులోనే ఆ కుటుంబానికి 'జేజే'లు పలికాడు.

అంతలో విమలా ఆచార్య 'ట్రే'లో కాఫీలు తెచ్చి అందించింది.

"పద్మపాణి ఎక్కడెక్కడ పనిచేసాడు?" కాఫీ చప్పరిస్తూ అడిగాడు పార్వతీశం.

"ట్రయినింగ్ అవగానే 2-రాజ్‌పుతానా రైఫిల్స్‌కి కేటాయించారు సెకండ్ లెఫ్టినెంట్‌గా కొన్నాళ్లు కాశ్మీరులో పనిచేసాక గ్వాలియర్ వేసారు. మేజర్ ప్రమోషన్ వచ్చాక మళ్లీ కాశ్మీ రు పోస్టింగు ఇచ్చారు. మొన్న జనవరిలో సెలవు మీద వచ్చాడో లేదో చొరబాటుదారుల్ని తరిమి వేసేందుకు రమ్మని ఫోను! వెంటనే బయల్దేరి వెళ్లిపోయాడు. జూన్ 21 వాడి పుట్టినరోజు. ఆ రోజు వీలుకాక ఆ మర్నాడు ఫోను చేసాడు. అప్పటికే యుద్ధరంగంలో ఉన్నాడు. దేశం కోసం యుద్ధం చేస్తున్న సైనికుల క్షేమానికి, విజయానికీ ప్రార్ధన చేయమని వాళ్లమ్మకి చెప్పా డు. ఏమోయ్, మిసెస్ విమలా ఆచారీ! ప్రార్ధన చేస్తున్నావా?" అని చమత్కారంగా అడిగాడు.

సమాధానంగా ఆమె మందహాసం చేసింది.

'ఏ తల్లి ప్రార్ధనలు చేయకుండా ఉండ గలదు?!' అనుకున్నాడు పార్వతీశం మనసు లోనే.

"చిన్నప్పుడు వాళ్లమ్మతో అనేవాడు - 'అమ్మా! నేను నాన్నగారిలా ఆకాశంలో యుద్ధం చేయను. నేలమీదనే యుద్ధం చేస్తా'నని. అంత చిన్న వయస్సులోనే ఆర్మీ మీద అంత మక్కువ కలగడం ఆశ్చర్యం!"

అంతలో పద్మపాణి భార్య చారులతా ఆచా ర్య లోపలి నుంచి వచ్చింది. ఆమె నిండు గర్భిణి. వస్తునే పార్వతీశానికి నమస్కారం చేసింది.

"ఏమ్మా! వంట్లో కులాసాగా ఉందా?"


"ఫరవాలేదు అంకుల్!" అంది సోఫాలో కూర్చుంటూ.

"రెండు నెలల్లో మా ఇంట జూనియర్ పద్మ పాణి జన్మించబోతున్నాడు" అన్నాడు నవ్వుతూ జగన్నాధ ఆచార్య.

"ఏమ్మా? వాడిని కూడా ఆర్మీ ఆఫీసర్ చేస్తావా?"

"తప్పకుండా అంకుల్!" అందామె నిస్సం కోచంగా.

"చాలా సంతోషంగా ఉందమ్మా. నీలాగా




అందరూ వీరపత్నులుగా ఉంటే మన దేశరక్షణ గురించి దిగులు పడాల్సినదేమీ ఉండదు"... మనస్ఫూర్తిగా అభినందించాడు పార్వతీశం.

"కాశ్మీరులో ఉగ్రవాదుల్ని ఏరిపారేసే డ్యూటీలో ఒకమాటు బుల్లెట్ తగిలి ఆస్పత్రిలో చేరాడు. దేవుడి దయవలన క్షేమంగా బయట పడ్డాడు" అంది విమలాఆచార్య గతం గుర్తు చేసుకుంటూ.

"అంతేనమ్మా! ఏ క్షణం ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. మృత్యువెప్పుడూ నీడలా వెన్నంటే ఉంటుంది. వీరమరణం పొందే అదృష్టం కేవలం సైనికులకే ఉంటుంది. వారు చిందించే ప్రతి రక్తబిందువుకీ ఎంతో విలువ ఉంది..." ఉద్వేగంగా అన్నాడు పార్వతీశం.

జగన్నాథ ఆచార్య టి.వి. పెట్టాడు.

యుద్ధరంగం వార్తలు వస్తున్నాయి.

* * *

అది ద్రాస్ యుద్ధరంగం-

మేజర్ పద్మపాణి ఆచార్య తన సహచరులతో కొండ శిఖరం వైపు ఎగబ్రాకుతున్నాడు.

2-రాజ్‌పుతానా రైఫుల్స్‌కి యుద్ధరంగంలో ధైర్యసాహసాలకు పెట్టింది పేరు. అసాధ్యమైన కార్యాలను సుసాధ్యం చేసుకోగల నైపుణ్యం వారి సొత్తు.

పద్మపాణికి కాశ్మీరులోని కీలకప్రాంతాల్లో పనిచేసిన అనుభవం ఉంది. తీవ్రవాదులతో ఎన్నోసార్లు తలపడ్డాడు.

ప్రాణాలను పణంగా పెట్టి, ఎంతో సాహసంగా ఎందరినో మట్టుబెట్టాడు. ఇప్పుడు ద్రాస్ - బటాలిక్ సెక్టర్ల మధ్య చొరబాటుదార్లను ఏరివేయడం ప్రస్తుత లక్ష్యం.

కొద్దిపాటి నిర్లక్ష్యమే కొండల మీద చొరబాటుదార్లు తిష్టవేసుకోవడానికి అవకాశమిచ్చింది. ఇప్పుడు అధిక మూల్యం చెల్లించాల్సి వస్తోంది. అయినా తప్పదు. సరిహద్దులు క్షేమంగా ఉంటేనే దేశం క్షేమంగా ఉంటుంది.

మేజర్ పద్మపాణి పట్టుదలగా ముందుకు సాగుతూనే ఉన్నాడు. సహచరులు అనుసరిస్తూనే ఉన్నారు. వారి ఉనికిని పసిగట్టిన శత్రువులు పైనుండి కాల్పులు ప్రారంభించారు. వాళ్ల బంకరుకి అంత సమీపంగా పద్మపాణితో సహా కొందరు సిపాయిలు చేరుకోవడం శత్రువులకి ఆశ్చర్యం కలిగించింది. అంతలోనే తేరుకుని, కాల్పులు సాగించారు.

ఒక శత్రుసిపాయి గ్రెనేడ్‌ని సూటిగా పద్మపాణి మీదకు గురిపెట్టి విసిరాడు. దానిని నేర్పుగా ఒడిసిపట్టుకుని పద్మపాణి తిరిగి బంకర్ మీదకు విసిరాడు. అది పెద్ద శబ్దంతో పేలింది. కొద్ది నిమిషాలు నిశ్శబ్దం!

అంతలోనే మళ్లీ కాల్పులు ప్రారంభం.

పద్మపాణి, సహచరులు ఎదురుకాల్పులు జరుపుతున్నారు. మృత్యుదేవత అక్కడ కరాళ నృత్యం చేయసాగింది.

* * *

హైదరాబాదు నగర శివార్లలోని హస్తినాపురం కాలనీలో ఆరోజు హడావిడిగా ఉంది. పోలీసు సెక్యూరిటీ ఏర్పాటు చేయడంతో వాళ్లు జనాన్ని కట్టడి చేస్తున్నారు.

అయినా జనం కుతూహలంగా చూస్తూనే ఉన్నారు.

అంతలో సైరన్ మ్రోగించుకుంటూ 'పైలట్' కారు వేగంగా వచ్చింది.

మరికొద్ది నిమిషాల్లో గవర్నరు కారు వచ్చింది.

అందులోంచి రంగరాజన్ దంపతులు దిగి, నేరుగా జగన్నాథ ఆచార్య ఇంట్లోకి నడిచారు.

ప్రవేశద్వారం దగ్గరే ఆచార్య దంపతులు వారికి ముకుళిత హస్తాలతో స్వాగతం పలికారు. అందరూ లోపలికి వెళ్లారు. ఎదురుగా కుర్చీలో పద్మపాణి ఆచార్య పెద్దఫొటో – దానికి పూలమాలను సరిచేస్తూ చారులత కనిపించారు. అలికిడి విని, చప్పున ఇటు తిరిగి గవర్నరు దంపతులకు నమస్కరించింది. గవర్నర్ శ్రీమతి చారులతను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ధైర్యం చెబుతున్నట్టు వెన్నుతట్టారు.

అందరూ సోఫాలలో కూర్చున్నారు.

గవర్నరు చారులతను మాటలతో ఓదార్చారు. ఆమె తల్లి కాబోతున్నదని తెలిసి ఆయన మనసు ఆర్ద్రమైపోయింది. పుట్టబోయే శిశువుకి ఇప్పుడు తండ్రిలాలన లేదు...

చారులత మాత్రం ధీరగంభీరంగా ఉండి, దుఃఖాన్ని అంతరంగంలోనే అణిచివేసింది.

"ఆయన చనిపోయేముందు శత్రువుల్ని చాలామందిని మట్టుబెట్టారట. ఒక బంకరు ధ్వంసం చేసారట..." ఒకింత గర్వంగా చెప్పింది చారులత.

"నీ భర్తలాంటి మహాయోధులు చిరస్మరణీయులు. జాతి వారిని ఎన్నటికీ మర్చిపోదు" అన్నారు గవర్నరుగారు.

అక్కడకు వచ్చిన స్థానికపెద్ద ఒకాయన "మా కాలనీ కూడలిలో పద్మపాణి ఆచార్య కాంస్య విగ్రహాన్ని పెట్టాలనుకుంటున్నాం సార్" అన్నాడు.

"చాలా మంచి పని! అది ఎందరో యువకులకు స్ఫూర్తినిస్తుంది..." అన్నారు అభినందనగా గవర్నర్. కాస్సేపు కూర్చుని, గవర్నర్ దంపతులు ఇద్దరూ మేజర్ పద్మపాణి ఆచార్య ఫొటోముందు శ్రద్ధాంజలి ఘటించి, తిరుగు ప్రయాణం అయ్యారు.

మేజర్ పద్మపాణి ఆచార్య ఫొటోమీద దండలు గర్వంగా ఊగుతున్నాయి. ●

(ఇండియా టుడే సౌజన్యంతో)